సాక్షి కర్నూలు

మంగళవారం । 17 । జూన్ । 2025



భక్తుల విరాళం.. ప్రగతి పరిమళం

ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. భక్తుల విరాళాలతో అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నారు. 8లో▸



చిన్నారిపై వీధి కుక్కల దాడి

బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్ కాలనీకి చెందిన రెండున్నరేళ్ల బాలుడు ప్రణీత్‌పై వీధి కుక్కలు దాడి చేశాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,605.32
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 29.108
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 13,322
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 180

న్యూస్‌రీల్

వెబ్‌సైట్లలో ఎంపిక జాబితా

- 19న కర్నూలు మెడికల్ కాలేజీలో కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్స్, నర్సింగ్ కాలేజీల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి 10 కేటగిరి అభ్యర్థుల ఫైనల్ మెరిట్, సెలక్షన్ లిస్టులు ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉంచినట్లు కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల నకలు సర్టిఫికెట్లతో ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజిలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. అలా హాజరుకాని వారి ఎంపిక రద్దు చేస్తామని తెలిపారు. ఎంపిక జాబితా వివరాలు https://kurnool.ap.gov.in, https://nandyal.ap.gov.in, https://kurnoolmedicalcollege.ac.in ఉంచినట్లు తెలిపారు.

అన్నదాత సుఖీభవ
రైతులకు ఈ-కేవైసీ తప్పనిసరి

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయానికి అర్హత పొందిన రైతులు వెంటనే బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయానికి 2,55,265 మంది రైతులు అర్హత పొందారన్నారు. ఇప్పటి వరకు 2,49,251 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత పొందిన రైతులు ఈ నెల 20లోపు విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. లేదంటే పెట్టుబడి సాయానికి అర్హత కోల్పోతారని, ఏ రైతు సేవ కేంద్రంలోనైనా ఈ-కేవైసీ చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

నందవరం: తల్లికి వందనం అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో చేపట్టే రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పెండింగ్‌లోని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్య, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్ తదితరులు ఉన్నారు.



దారితప్పిన పాలన!

ప్రమాదకరంగా హొళగుంద-ధణాపురం రోడ్డు

- ఈ ప్రాంతంలో విధులకు ఉద్యోగాలకు అయిష్టం
- జెడ్పీ హైస్కూల్‌లో అరకొర ఉపాధ్యాయులు
- 40 నిముషాల ప్రయాణానికి రెండు గంటలు
- ఆదోనికి ఎల్లార్తి మీదుగా అధిక శాతం రాకపోకలు
- అత్యవసర సమయాల్లో 108 చేరుకోవడం కూడా కష్టమే



ఇది హొళగుందలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. 1,800 మందికి పైగా విద్యార్థులు ఉంటారు. 53 మంది టీచింగ్, 10 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ అవసరం. అయితే గత విద్యా సంవత్సరం 39 మంది ఉపాధ్యాయులతోనే నెట్టుకొచ్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 26 మంది ఇతర ప్రాంతాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన మిగిలింది 13 మంది కాగా, ఇతర ప్రాంతాల నుంచి ఐదుగురు మాత్రమే ఇక్కడికి బదిలీపై రానుండటం గమనార్హం.

.. ఈ పరిస్థితికి కారణం హొళగుంద-ధణాపురం రోడ్డు. ఈ రహదారిలో ప్రయాణం సాగించలేక ఉపాధ్యాయులు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తిచూపడం లేదని తెలుస్తోంది.



హొళగుంద-ధణాపురం రోడ్డులో ఆర్టీసీ బస్సు చెడిపోయిన దృశ్యం(ఫైల్)



భారీ వర్షం వస్తే హెబ్బటం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చెళ్లవంకను దాటుతున్న వాహనం(ఫైల్)

హొళగుంద: జిల్లా కేంద్రానికి దూరంగా కర్ణాటక సరిహద్దులోని హొళగుంద అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. తాము అధికారంలోకి వస్తే రోడ్లను మెరిపిస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు.. ఏడాది గడిచినా ఈ ప్రాంతంపై దృష్టి సారించని పరిస్థితి. ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే రహదారి ఎంతో ముఖ్యం. అయితే ఇక్కడ రహదారి చూస్తే పై ప్రాణం పైనే పోతుంది. హొళగుంద-ధణాపురం రోడ్డు సుమారు 25 కిలోమీటర్లు ఉంటుంది. అడుగడుగునా మోకాల్లోతు గుంతలు.. రాళ్ల రప్పలతో అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ కారణంగా చాలా మంది ప్రజలు ఆదోని రోడ్డులో రాకపోకలే వదిలేశారు. కొన్ని ఆర్టీసీ బస్సులు తప్పితే, మిగతా వాహనాలన్నీ ఎల్లార్తి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారి సమస్యతో ఒక్క టీచర్లే కాదు, ప్రభుత్వ శాఖల అధికారులు దాదాపుగా ఈ ప్రాంతానికి రావడానికి ఆసక్తి చూపని పరిస్థితి. ఆదోని రెవెన్యూ డివిజన్ కావడంతో విద్య, వైద్యంతో పాటు ఏ చిన్న అవసరం వచ్చినా హొళగుంద ప్రజలు ఆదోనికి వెళ్లాల్సి ఉంటుది. ఈ నేపథ్యంలో దారుణమైన రోడ్డులో ప్రయాణం నిత్య ప్రమాదాలకు కారణమవుతోంది. పిల్లల చదువు, వైద్యం, ఇతరత్రా అవసరాల దృష్ట్యా చాలా మంది ఉద్యోగులు ఆదోనిలోనే ఉంటూ ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి వారంతా ప్రత్యక్ష నరకం చూడాల్సి వస్తోంది.

40 నిమిషాల ప్రయాణానికి రెండు గంటలు

పిల్లల చదువులు, ఇతర అవసరాల దృష్ట్యా టీచర్లు, ఇతర ఉద్యోగులు ఆదోని, ఎమ్మిగనూరు తదితర పట్టణాల్లో ఉంటూ హొళగుందకు వచ్చిపోతున్నారు. ఆదోని నుంచి ఆర్టీసీ బస్సు, సొంత వాహనంలో బయలుదేరితే 40 నిమిషాల్లో హొళగుందకు చేరుకోవాలి. అధ్వానమైన రోడ్డు కారణంగా గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతోంది. ఈ కారణంగానే ఇక్కడికి వచ్చేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపడంలేదు.

– విజయ్‌కుమార్, జెడ్పీ హైస్కూల్ టీచర్

పిల్లల చదువులు సాగేదెట్లా..



హొళగుంద హైస్కూల్లో నా కుమారుడు ఉమేశ్ 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో పూర్తిస్థాయిలో టీచర్లు లేరు. బదిలీల్లో కూడా ఇక్కడికి వచ్చేందుకు ఎవరూ ఇష్టపడటం లేదు. అరకొర టీచర్లతో మా పిల్లలకు నాణ్యమైన చదువు అందడం లేదు. హొళగుంద-ధణాపురం రోడ్డు అనేక చోట్ల కోతకు గురైంది. కిలోమీటర్ల మేర రాళ్లు రప్పలు తేలి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించాలి.

– బోయ సిద్ధలింగ, విద్యార్థి తండ్రి, హొళగుంద

రోగుల తరలింపు ఇబ్బందికరం

హొళగుంద, చుట్టుపక్క ప్రాంతాల నుంచి అత్యవసర కేసులు, డెలివరీలు వస్తే ఆదోనికి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. హొళగుందలోనే కేసు ఉంటే ఎల్లార్తి మీదుగా వేగంగా వెళ్లిపోతాం. వందవాగిలి, హెబ్బటం పరిధిలో కేసులు వస్తే తప్పని సరిగా ధణాపురం రోడ్డులోనే వెళ్లాల్లి ఉంటుంది. గుంతలు, కోతలతో ఉన్న రోడ్డులో రోగులతో సకాలంలో పెద్దాసుపత్రికి చేరుకోలేకపోతున్నాం. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– రంగస్వామి, 108 ఈఎమ్టీ, హొళగుంద పిహెచ్‌సీ

'సూపర్‌సిక్స్' పేరుతో
ప్రజలకు వెన్నుపోటు



వెన్నుపోటు పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, నియోజకవర్గ నాయకులు

- మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: సీఎం పదవి కోసం 'కూటమి'గా ఏర్పడి, సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను టీడీపీ అధినేత చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. సోమవారం స్వగ్రామం రాంపురంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డితో కలిసి వెన్నుపోటు పుస్తకాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనాడు పార్టీ కోసం సొంత మామనే వెన్నుపొడిచి చంద్రబాబు చరిత్రకెక్కారని విమర్శించారు. వెన్నుపోటు పొడవటంలో సీఎం చంద్రబాబు ఎంతో దిట్టని ఆరోపించారు. పొత్తులు లేకుండా ఏనాడు ఆయన అధికారంలోకి వచ్చింది లేదని గుర్తు చేశారు. అధికార దాహంతో 143 హామీలు గుప్పించి ఏడాది పాలనలో కేవలం రెండు పథకాలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.

అక్రమ కేసులు .. అఘాయిత్యాలు

చంద్రబాబు ఏడాది పాలన అంతా రెడ్‌బుక్ రాజ్యాంగం నడిచిందని ఎమ్మెల్యే విమర్శించారు. కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసుకుని అక్రమ కేసులు బనాయింపుతో సరిపెట్టుకున్నారన్నారు. మహిళలు, చిన్నారులపై రాష్ట్ర వ్యాప్తంగా అఘాయిత్యాలు ఎక్కువైనా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. హామీలను మరిపించేందుకు రోజుకో ఘటన తెరపైకి తెస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకంలోనూ చంద్రబాబు వైఫల్యాలు కుప్పలు తెప్పలుగా బయటకు వస్తున్నాయన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శులు ఏకాంబరరెడ్డి, మాబుసాబ్, యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురామ్, ఆయా మండలాల కన్వీనర్లు జి.భీమారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రహ్లాదాచార్, బెట్టనగౌడ్, బూత్ కమిటీ నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌతాళం ఎంపీపీ అమరేష్ పాల్గొన్నారు.

మోసం.. బాబు నైజం



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి

ఆలూరు: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను మరచి సీఎం చంద్రబాబు అరాచక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బి.విరూపాక్షి విమర్శించారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తున్న వారిని ''నాలుక చీరేస్తా, మడత పెడుతా'' అని ముఖ్యమంత్రి హెచ్చరించడం దారుణమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు జీవితకాలమంతా వెన్నుపోటు రాజకీయాలతో సరిపోయిందని ఆరోపించారు. ఆలూరులోని పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు బుక్‌లెట్, వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' హామీలు ఇచ్చి నేడు లోటు బడ్జెట్ అని సాకులు చెబుతూ మోసం చేస్తునారని, మోసం బాబు నైజమేనన్నారు. ఇంటికి రూ.12 వేలు ఆదాయం మించి ఉండకూడదని పలు నిబంధలను విధించి పేదలను సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నారన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్

ఎన్ని ఇబ్బందులు ఉన్నా పేదలకు వైఎస్సార్ కుటుంబం అండగా నిలిచిందని ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేశామన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పలు సమస్యలు ఎమ్మెల్యేకు చెప్పగా.. గుండెను నిబ్బరం చేసుకుని కూటమి నేతల ఆగడాలనకు అడ్డుకట్ట వేద్దామన్నారు. పార్టీకి, నాయకత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని..త్వరలోనే చీకటి వెళ్లి వెలుగు వస్తుందన్నారు. ఆలూరు ఎంపీపీ రంగమ్మ, మాజీ యార్డు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మండల కో-ఆప్షన్ వీరేష్, పార్టీ రాష్ట్ర పబ్లిక్‌వింగ్ కార్యదర్శి జనార్దన్ నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు బసవరాజ్, మారయ్య, రామకృష్ణ, సీనియర్ నాయకులు కోకిలతోట శేషప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గిరి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో శ్రీమఠం అధికారులు, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు తదితరులు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. స్థానిక నరహరి తీర్థ అతిథి గృహంలో విడది చేసిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం శ్రీమఠం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు హారతులు పట్టి అర్చనలు చేశారు. ఎంపీ బస్తిపాడు నాగరాజు సైతం ఆయనతోపాటు దర్శనం చేసుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావన దర్శనంతో మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం రాయచూరు జిల్లా కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అమ్మవారి దర్శనం ముగించుకుని మధ్యాహ్నం మంత్రాలయం వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆయనకు పుష్పగుచ్ఛాలతో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాత్రి శ్రీమఠంలో రథోత్సవాలను తిలకించారు. మంత్రి కుటుంబ సభ్యులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలాలు, రాఘవేంద్రుల జ్ఞాపిక అందజేసి అక్షింతలతో ఆశీర్వదించారు. డీఎస్పీ ఉపేంద్ర బాబు నేతృత్వంలో బందోబస్తు చేపట్టారు. మఠం ఏఏవో మాధవశెట్టి ఆధ్వర్యంలో మంత్రికి మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు. ఆయనతోపాటు మఠం మేనేజర్ శ్రీనివాస రావు, సీఐ రామాంజులు, ఎస్ఐలు ఉన్నారు.

అప్పుల బాధతాళలేక రైతు ఆత్మహత్య



పులకుర్తి రాముడు(ఫైల్)

నందవరం: అప్పుల బాధ తాళలేక రైతు పులకుర్తి రాముడు(47) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రాముడికి పది ఎకరాల పొలం ఉండగా రెండేళ్లుగా పత్తి, మిరప పంటలు సాగు చేశాడు. పెట్టుబడి కోసం బ్యాంకు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.18.50 లక్షలు అప్పు చేశాడు. పంటలు దిగుబడులు లేక, గిట్టుబాటు ధరలు లేక అప్పులు ఎలా తీర్చాలో మధనపడుతూ ఉండేవాడు. శనివారం మనస్తాపం చెంది పొలంలో పురుగు మందు తాగి పడిపోయాడు. అక్కడ పని చేస్తున్న రైతులు గమనించిన వెంటనే బంధువులకు సమాచారం అందించారు. బంధువులు హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృత్యువాత పడ్డాడు. రాముడి భార్య పులకుర్తి గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రాముడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి అండగా నిలిచిన వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఊరించి.. ఉసూరుమనిపించి!

- స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేయని రాష్ట్ర ప్రభుత్వం
- మహిళల్లో వెల్లువెత్తుతున్న ఆందోళన

కర్నూలు(అగ్రికల్చర్): స్పౌజ్ పింఛన్‌లు ఇస్తున్నామంటూ నెల రోజుల క్రితం నుంచి వేలాది మంది మహిళలను కూటమి ప్రభుత్వం ఊరించింది. జూన్ 12న పంపిణీ చేస్తామని కూడా ప్రకటించింది. ఏపీ బ్యాంకుకు ఎంతెంత మొత్తం విడుదలవుతున్న విషయం జిల్లా యంత్రాంగానికి ఇచ్చింది. అయితే 12వ తేదీ గడచినపోయినప్పటికీ స్పౌజ్ పింఛన్లల పంపిణీ ఊసే లేకుండా పోయింది. ఊరించి ఉసూరుమనింపించడంతో మహిళల తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

కోతలు కోసి..

వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్యకాలంలో మృతిచెందిన వారి స్థానాల్లో వారి భార్యలకు వితంతు పింఛన్లు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఈ ప్రకారం మహిళలు ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేశారు. అయితే వందలాది మందికి పింఛన్లు మంజూరు కాలేదు. కోతలు కోసి కర్నూలు జిల్లాలో 2,319, నంద్యాల జిల్లాలో 2,463 ప్రకారం 4,782 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు చేశారు. మొత్తం రూ.1,91,28,000 ఏపీ బ్యాంకుకు విడుదల చేస్తున్నదనే దానిని కూడా ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇచ్చింది. ఈ నెల 12న పంపిణీ చేస్తామని ప్రకటించింది. అయితే తర్వాత ఆ ఊసే లేకుండా పోయింది. ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. జూన్ 12న పింఛన్లు పంపిణీ చేయలేదు. మళ్లీ ఎపుడు ఇచ్చేది కూడా ప్రభుత్వం ప్రకటించలేదు.

నేడు, రేపు బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 17, 18 తేదీల్లో జూమ్ ద్వారా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 17న గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్లు, డ్రైవర్లు, ఎంపీహెచ్‌ఏ (మేల్, ఫీమేల్), 18న జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ కంప్యూటర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ, క్లీనర్, వాచ్‌మెన్, తోటి, హెల్పర్, స్వీపర్, స్వీపర్ కమ్ తోటి, ఎఫ్‌డబ్ల్యూడబ్ల్యూ(ఎం), వాటర్ మెన్ కమ్ వాచ్‌మెన్, స్ట్రెచర్ బేరర్, స్వీపర్, ఫీమేల్ అటెండెంట్, ఎక్స్‌రే అటెండెంట్, ల్యాబ్ అటెండెంట్లకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వీరు ఎవరి పీహెచ్‌సీల్లో వారు జూమ్ ద్వారా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ తెలిపారు.



కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరుడు

ప్రాచీన సంగమేశ్వర పుణ్య క్షేత్రాన్ని కృష్ణా జలాలు చుట్టుముడుతున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండటంతో బ్యాక్ వాటర్ పెరుగుతోంది. దీంతో సంగమేశ్వరం క్షేత్రం గర్భాలయంతో పాటు ఆలయ మండపం వరకు నీళ్లు చేరాయి. తీరం వెంబడి జలకళ సంతరించుకుంది.

– నందికొట్కూరు

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి



నాగలదిన్నెలో చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

నందవరం: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. సోమవారం ఆయన మండల కేంద్రం పోలీసు స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం నాగలదిన్నె వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు తనిఖీ చేశారు. అలాగే గురజాల గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి, పార్వతీ దేవిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో నేర నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎమ్మిగనూరు రూరల్ సీఐ మధుసుధన్ రావు, ఎస్ఐ కేశవ ఉన్నారు.

క్లుప్తంగా

చిన్నారిపై వీధి కుక్కల దాడి



బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన రాజేష్, మౌనిక దంపతుల కుమారుడు రెండున్నర ఏళ్ల చిన్నారి ప్రణీత్‌పై సోమవారం వీధి కుక్కలు దాడి చేశాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై మూడు వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. తల్లిదండ్రులు గమనించి కేకలు వేయడంతో కుక్కలు పారిపోయాయి. గాయపడిన ప్రణీత్‌ను వెంటనే స్థానిక వైద్యశాలకు తరలించారు. గత నెల 2వ తేదీన ఇదే కాలనీ చెందిన 4 ఏళ్ల చిన్నారి షేక్ మొహిద్దీన్ వీధి కుక్కల దాడిలో మరణించిన సంఘటన విదితమే. ఈ ఘటనతో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం చేపట్టాలని నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రజలు ఆందోళన చేయగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హరి ప్రసాద్, సీఐ వెంకటేశ్వరరావు హామీ ఇచ్చి విస్మరించారు. పూర్తి స్థాయిలో కుక్కలను తరలించక పోవడంతో పట్టణంలో చిన్నారులు, పెద్దలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. నెలలో 60 నుంచి 80 మంది వరకు కుక్క కాటు బాధితులు ఆసుపత్రిలో వైద్యం కోసం వస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం అవుతుంది. గత నెల 25వ తేదీన దుర్గాపేట కాలనీకి చెందిన బాలుడు కృపరాజుపై, ఈనెల 11వ తేదీన పట్టణంలోని బోయపేట కాలనీ ఆడుకుంటున్న మమతపై వీధి కుక్క దాడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల బెడదతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మహానందిలో భక్తుల సందడి



మహానంది: మహానందిలో సోమవారం భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం కాస్త రద్దీ కనిపించినా సాయంత్రం నుంచి భక్తుల సందడి తగ్గింది. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి ఆలయాలతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలకు సందర్శించారు.



రూ. 6లక్షలతో నిర్మించిన షెడ్



తాగునీటి సంప్ పనులు



మహిళలకు ప్రత్యేకంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లు



తూర్పు గోపురం ముందు భాగంలో వేస్తున్న షెడ్డు

భక్తుల విరాళం.. ప్రగతి పరిమళం

- ఉరుకుంద క్షేత్రంలో శరవేగంగా అభివృద్ధి పనులు

కౌతాళం: భక్తులు ఇచ్చిన విరాళాలతో ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. క్షేత్రంలో రూ.1.80కోట్లతో కోనేరు నిర్మాణాన్ని బెంగళూరుకు చెందిన భక్తుడు మంజునాథ్ ప్రారంభించారు. ఈ పనులు జరుగుతున్నాయి. గోశాల విస్తరణను రూ. 13 లక్షలతో పూర్తి చేయడానికి ఇద్దరు భక్తులు ముందుకు వచ్చారు. శ్రీశైలం క్షేత్రం మాదిరిగా రథం ఇక్కడ ఏర్పాటు చేయడానికి రూ. 1.30 కోట్ల విరాళం ఇవ్వడానికి ఓ భక్తుడు ముందుకు వచ్చాడు. ఇటీవలే రూ. 7కోట్లు విలువైన 1.01 ఎకరాల భూమిని దాత దేవాలయానికి రిజిష్టర్ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. అన్నదానం సత్రం భవనం సరిపోకపోవడంతో భక్తులు 1.50 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చారని, ఆ స్థలంలో జీప్లస్‌తో మూడు అంతస్తులతో అన్నదాన సత్రం నిర్మించడానికి రూ. 2.30కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆయన చెప్పారు. వసతి గదులకు నీటి కొరత ఏర్పడకూడదని రాజనగర్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి ప్రత్యేక పైప్‌లైన్‌తో ఏర్పాటు చేసి పెద్ద సంప్ నిర్మిస్తున్నట్లు డీసీ తెలిపారు. అంతరాలయం దర్శనం కోసం రూ.వెయ్యి టిక్కెట్ పెడుతున్నట్లు చెప్పారు. అలాగే స్లాట్ దర్శనం కూడ ఏర్పాటు చేస్తామన్నారు.

ఇవీ పనులు..

- ఈరన్నస్వామి పురాతన ఆలయం తవ్వకాల్లో ఒక ప్లేట్ దర్శనం ఇచ్చింది. అందులో 9 వారాలు, 9 ప్రదక్షణలు అంటూ ఉంది. ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి 9 వారాలు, 9 ప్రదక్షణలు కార్యక్రమానికి శ్రీకారం చేపడుతున్నారు.
- ఉత్తరం ద్వారం వద్ద వీఐపీ లాంచ్ ఏర్పాటు చేస్తున్నారు.
- ఎండకు, చలికి, వర్షానికి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయం ప్రధాన తూర్పు ద్వారం లోపల నాల్గు దిక్కుల్లో రూ. 6లక్షలతో షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు.
- వర్షం వస్తే భక్తుల కాళ్లకు బురద అంటుకోకుండా దేవాలయం చుట్టూ సిమెంటు పేవర్స్ ఏర్పాటు చేస్తున్నారు.
- కాంపౌండ్ వాల్ నిర్మాణం కూడా ప్రారంభించారు.

రాజీనామా చేయాలని టీడీపీ వేధింపులు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్
- పీజీఆర్ఎస్‌కు 93 ఫిర్యాదులు



పీజీఆర్ఎస్‌లో ఎస్పీకి సమస్యలు చెప్పుకుంటున్న బాధితులు

కర్నూలు: మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తనను రాజీనామా చేసి వెళ్లిపోవాలని టీడీపీకి చెందినవారు ఒత్తిడి చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామానికి చెందిన ఆనంద్ ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా ఎస్పీ మాట్లాడారు. మొత్తం 93 ఫిర్యాదులు రాగా.. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- హైదరాబాదులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో తన కుమారుడు జహీర్ బాషాకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.2.50 లక్షలు తీసుకుని కర్నూలుకు చెందిన సీలం ధరణి మోసం చేసిందని కర్నూలు బి.క్యాంప్‌కు చెందిన ఆశా జహ ఫిర్యాదు చేశారు.
- మాధవరం గ్రామంలోని స్టీల్ ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.50 లక్షలు తీసుకుని ఒక వ్యక్తి మోసం చేశాడని కోసిగి గ్రామానికి చెందిన పరుశురాముడు ఫిర్యాదు చేశారు.
- రూ.2 లక్షల విలువ గల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా కర్నూలు బుధవారపేటకు చెందిన కృష్ణస్వామి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాసవి నగర్‌కు చెందిన వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు.
- జొహరాపురం ఇందిరమ్మ ఇళ్లల్లో నా ఫ్లాట్‌ను ఆక్రమించుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని కర్నూలుకు చెందిన రంగారెడ్డి ఫిర్యాదు చేశారు.
- తాను కొనుగోలు చేసిన మూడు సెంట్ల స్థలంలో ఇంటిని నిర్మించుకోకుండా ధరణిపోగుల లవకుమార్ బంకు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మునగాల గ్రామానికి చెందిన ఆంజనేయులు ఫిర్యాదు చేశారు.

ముగిసిన ఉపాధ్యాయుల బదిలీలు

- పదోన్నతులు పొందిన 944 మంది టీచర్లు
- సోమవారం విధులకు హాజరు



ఓర్వకల్లులో రిపోర్ట్ చేసుకున్న బదిలీ అయిన ఉపాధ్యాయులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, నగరపాలక సంస్థ యాజమాన్యాలకు చెందిన స్కూళ్లలో పని చేస్తున్న టీచర్ల పదోన్నతులు, బదిలీలు సోమవారంతో ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో 7,142 మంది ఉపాధ్యాయుల బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 5,763 మంది మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా ఖాళీలను ఎంపిక చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్-2)134 మంది, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలు 406 మంది, స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాటగిరీకి చెందిన వారు 2,788 మంది, ఎస్‌జీటీ, తత్సమాన క్యాటగిరి టీచర్లు 2,273 మంది, భాషా పండితులు 1,19 మంది, పీఈటీ 32 మంది, ఆర్ట్,క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు 11 మంది బదిలీ అయిన వారిలో ఉన్నారు. ఆయా మండలాల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నప్పటికీ అనుకూలమైన స్థానాలు లేవని 1,485 మంది బదిలీలపై ఆసక్తి చూపలేదు. శనివారం శనివారం మధ్యాహ్నానికే ఎస్‌జీటీల బదిలీ ఆర్డర్లు వచ్చాయి. అదే రోజు రిలీవ్ అయి..ఆదివారం సెలవైనా బదిలీ అయిన స్కూల్‌లో రిపోర్ట్ చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులందరూ సోమవారం కొత్త స్కూళ్లలో విధులకు హాజరయ్యారు.

944 మందికి పదోన్నతులు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన ఆయా క్యాటగిరి టీచర్లకు పదోన్నతులు కల్పించారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్ఎంలుగా 141, స్కూల్ అసిస్టెంట్లు(నాన్-లాంగ్వేజ్) 169, స్కూల్ అసిస్టెంట్లు(లాంగ్వేజెస్)గా 12, స్కూల్ అసిస్టెంట్లు(ఫిజికల్ సైన్స్)గా 8, ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా 614 మందికి పదోన్నలు పొందారు.

బదిలీల కష్టాలు ఇవీ..

- బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను గతంలో ఎన్నడూ కూడా లేని విధంగా ప్రతి రోజూ గంటల తరబడి నిర్వహించారు.
- గత నెలలో మొదలైన ప్రక్రియ సుమారుగా నెల రోజుల పాటు జరిగింది.
- ఈ ప్రక్రియతో విద్యాశాఖ అధికారులు పదో తరగతి పరీక్షలపై కూడా దృష్టి పెట్టలేనంత బీజీగా పని చేశారు.
- అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి బదిలీల జీఓలు విడుదల చేశారు.
- వెబ్ కౌన్సెలింగ్ వద్దు అని ఉపాధ్యాయుల సంఘాల నాయకులు రెండు రోజులు ఆందోళన చేయడంతో దిగొచ్చిన ప్రభుత్వం మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించింది.
- గతంలో ఎన్నడూ కూడా లేని విధంగా నాలుగు రోజుల పాటు రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించారు.
- కౌన్సెలింగ్ జరిగిన నాలుగు రోజులు అనేక అభ్యంతరాలు..అవాంతరాలు వచ్చాయి. బదిలీల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రత్యక్షంగానో..పరోక్షంగా తమకు అనుకూలమైన వారికి ఇష్టమైన స్థానాలు వచ్చేలా చేసుకున్నారని విమర్శలు వచ్చాయి.

ఉపాధ్యాయ ఉద్యమ కెరటం అస్తమయం



వై.జమ్మన్న

కర్నూలు (సిటీ): విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా విద్యాబోధన చేసి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేవలందించడంతోపాటు విద్యార్థులకు ప్రత్యేక పాఠశాల, వయోజనులకు రాత్రి పాఠశాలలు నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యమ కెరటం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును తిరస్కరించిన వై.జమ్మన్న (85) సోమవారం హైదరాబాదులోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. వై.జమ్మన్న కర్నూలు జిల్లా కల్లూరు మండలం బొల్లవరంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. అదే గ్రామానికి చెందిన విప్లవ నాయకుడు నీలం రామచంద్రయ్య మార్గదర్శకంలో కమ్యూనిస్టు భావజాలంతో విద్యనభ్యసించారు. హైస్కూల్ సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయుడిగా ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పారు. కోసిగి దొరల పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేశారు. ప్రతి నెలా తన జీతంలోంచి కొంత డబ్బులు పేద విద్యార్థులకు కేటాయించి ఫీజులు చెల్లించేవారు. జమ్మన్న కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా ఉండటంతో 1982లో ఉపాధ్యాయ పోస్టు నుంచి సస్పెన్షన్‌కు గురిచేశారు. అయితే ఆయన కోర్టులో పోరాటం చేసి గెలుపొంది తిరిగి ఉద్యోగంలో చేరారు. కర్నూలులో ఏపీటీఎఫ్ భవనం ఏర్పాటుకు 50 శాతం సొంత నిధులను కేటాయించారు. 1998లో పదవీ విరమణ పొంది స్వగ్రామంలో నీలం రామచంద్రయ్య స్మారక ఉన్నత పాఠశాలకు పునాదులు వేశారు. పాఠశాల భవన నిర్మాణానికి రూ.2 లక్షలు సొంత నిధులు కేటాయించి పూర్తి చేయించారు. ఈయన మృతి పట్ల ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు సంతాపం తెలిపారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

- ఉత్తుత్తి సలహాలకు సిద్ధమవుతున్న వ్యవసాయ శాఖ

కర్నూలు(అగ్రికల్చర్): 2025-26 సంవత్సరానికి సంబంధించి ఈ నెల 17 నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహణకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. 2024-25లో ఖరీఫ్ సీజన్ ముగిసే సమయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే రైతుల నుంచి స్పందన లేకపోయింది. పట్టుమని 10 మంది కూడా రాని పరిస్థితి. రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కూటమి ప్రభుత్వం రైతులకు పొలం పిలుస్తోంది పేరుతో ఉత్తుత్తి సలహాలకు పరిమితం కానుంది. రోజు రెండు గ్రామాల చొప్పున ఈ నెల 17 నుంచి అక్టోబర్ 30 వరకు వారంలో మంగళ, బుధ వారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది పేరుతో ఉత్తుత్తి సలహాలతో రైతులను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమం పట్ల ఆసక్తితో లేరని వ్యవసాయ అధికారులే పేర్కొంటున్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగమైన కల్పించాలి.. లేదంటే నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నాగరాముడు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిరుద్యోగ భృతిపై పోరాటమనే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయు డు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కూట మి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా నిరుద్యోగ భృతి లేదని మండిపడ్డారు. దీనిపై పోరాటా లు ఉధృతం చేయడంతో పాటు రాష్ట్ర గవర్నర్‌కు అర్జీలు పంపనున్నట్లు తెలిపారు. ఎలాంటి షరతు లు లేకుండా నిరుద్యోగ భృతి అమలు చేయాలని, ఇందుకోసం ఈ నెల 20వ తేదీన ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లను ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ప్రసాద్, రవి, విష్ణు, ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఐచర్ వాహనం దగ్ధం

- వాహనంలో నిద్రిస్తున్న వ్యక్తి క్షేమం



ప్రమాద సమయంలో చెలరేగిన మంటలు

వెల్దుర్తి: అగ్ని ప్రమాదంలో ఐచర్ వాహనం దగ్ధం కాగా అందులో నిద్రిస్తున్న చిన్న అనే వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. ఈ దుర్ఘటన పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తన స్థలంలో వెల్దుర్తికి చెందిన చాకలి మధు ఆదివారం రాత్రి రెండు ఐచర్ వాహనాలు, మూడు ఆటోలు పార్కింగ్ చేసి ఉంచారు. ఒక ఐచర్ వాహనం క్యాబిన్‌లో మధు కుటుంబీకుడు చిన్న నిద్రించాడు. ఈ స్థలంలో పాత టైర్లు 32 దాకా పేర్చి ఉంచారు. రాత్రి 11గంటల ప్రాంతంలో టైర్లు అంటుకుంటూ, పక్కనే ఉన్న సంపూర్ణ ఇండేన్ గ్యాస్ భవనం వెనుకభాగానికి, స్థలంలో ఉన్న ఐచర్ వాహనానికి అగ్ని రాజుకుంది. గమనించిన చుట్టుపక్కల వాసులు యజమానులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వాహనంలో ఉన్న చిన్నను నిద్ర లేపి బయటకు తీశారు. స్థానికులు, డోన్ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో మధుకు చెందిన ఐచర్ వాహనం ఇంజన్, క్యాబిన్ పూర్తిగా దగ్ధమై రూ.10 లక్షల మేర నష్టం కలిగింది. సంపూర్ణ ఇండేన్ గ్యాస్ భవనం పాక్షికంగా దెబ్బతింది. ఎవరో కావాలని చేసినదేనన్న అనుమానాన్ని బాధిత మధు కుటుంబం ఆరోపిస్తుండగా, ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని విచారించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కర్నూలు జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. అమరావతి జేఏసీ అధ్యక్షుడు కృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడుగా మురారి శంకరప్ప ఎన్నికయ్యారు. సంయుక్త అధ్యక్షులుగా చంద్రశేఖర్‌స్వామి(ఆలూరు), టీఎండీ హుసేన్(పత్తికొండ), కార్యదర్శిగా ఎంఎల్ నసరయ్య, ఉపాధ్యక్షులుగా వేదనాయకం, తిరుపతి సాయి, నటరాజన్, ఎలిజబెత్, సంయుక్త కార్యదర్శులుగా జయన్న, పాపరావు, మహేశ్వర్, రామసుబ్బారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జనార్దన్‌గౌడు, రాజు, కార్యనిర్వాహక సభ్యులుగా అరుణ్‌కుమార్, హరినారాయణ, జీఎల్.నరసయ్య ఎంపికయ్యారు. నూతన కార్యవర్గసభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. రిటైర్డ్ డీఎస్పీ పాపారావును సత్కరించారు.

జనసేన, టీడీపీ వర్గీయుల ఘర్షణ



బోరును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎస్ఐ సత్యనారాయణ

ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో జనసేన, టీడీపీ నాయకుల మధ్య సోమవారం ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామ పెద్దల సమాచారం మేరకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, సాగునీటి సంఘం చైర్మన్ ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య ఈ నెల 5వ తేదీన మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభించారు. వాటర్ ప్లాంటుకు ఏర్పాటు చేసిన బోరులో నీరు సరిగా రాకపోవడంతో ప్లాంటుకు సమీపంలో వున్న చేతిబోరు నుంచి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేపట్టాడు. ఈ విషయం తెలుసుకున్న మండల బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు, జనసేన నాయకులు జింకా వెంకటస్వామి అడ్డుకున్నారు. ఈ విషయంలో వారి మధ్య మాట మాట పెరిగి ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువురిని సర్దుబాటు చేశారు. స్థానికంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు లేకపోవడంతో దొర్నిపాడు ఎస్ఐ సత్యనారాయణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉయ్యాలవాడకు చేరుకుని విచారణ చేపట్టారు. 1999-2004 మధ్య నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సోదరుడు పోచా రాధాక్రిష్ణారెడ్డి సర్పంచ్‌గా కొనసాగిన సమయంలో భారతిసీడ్స్ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో 4 చేతి బోర్లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే కమతం వీధిలో ఏర్పాటు చేసిన బోరును టీడీపీ నాయకుడు ఆక్రమించుకుని వాటర్ ప్లాంటుకు నీటి సరఫరాకు ప్రయత్నించడంతో వివాదం చోటు చేసుకుంది. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా మండల వైఎస్సార్‌సీపీ, టీడీపీ కన్వీనర్లు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో పాటు గ్రామపెద్దల సమక్షంలో రెండు నెలల పాటు చేతి బోరును వాటర్ ప్లాంటుకు వాడుకునేందుకు ఒప్పుకోవడం జరిగింది. ముందస్తుగా ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా జనసేన, టీడీపీ నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

విద్యుత్ వైర్ల చోరీ

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని ఊటమల్ల వంక వద్ద ఉన్న పొలాల్లో ఆదివారం రాత్రి వ్యవసాయ విద్యుత్ వైర్ల చోరీ జరిగింది. కుమ్మరి రంగస్వామి, బాలు, వడ్ల నాగేంద్రలు సోమవారం ఉదయం తమ పొలాలకు వెళ్లి చూడగా బోర్ల నుంచి స్టార్టర్‌కు ఉన్న విద్యుత్ వైర్లు లేకపోవడం గమనించారు. గుర్తు తెలియని దొంగలు రాత్రి సమయంలో కోసుకుని పోయి ఉంటారని తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. వైర్ల చోరీ కారణంగా 15 ఎకరాల సాగుకు నీరందించే అవకాశం లేకుండా పోయిందని బాధితులు వాపోయారు. గత నెలలో సైతం ఇదే విధంగా చోరీ జరిగిందని పేర్కొంటూ పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

గమ్యం దూరమాయె!



శ్రీశైలం 148 కి.మీ అని సూచిస్తున్న బోర్డు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణం మీదుగా వెళ్తున్న 340సీ హైవేలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డుల్లో శ్రీశైలం 148 కి.మీ.గా రాశారు. నిజానికి ఆత్మకూరు నుంచి శ్రీశైలం 110 కి.మీ ఉంటుంది. మరి హైవే సూచికలు రాయించిన కాంట్రాక్టర్ అశ్రద్ధ వల్ల శ్రీశైలం 38 కి.మీ దూరం పెరిగినట్లయింది. దీంతో కొత్తగా ఈ రహదారిలో ప్రయాణించే వారు కొంత కంగారు పడుతూ, ఆపై విషయం అర్థమై నవ్వుకుంటూ వెళ్తున్నారు.

రైతు సేవాకేంద్రం వద్ద వేచి చూస్తున్న రైతులు



'రైతు సేవ' మూత

- పెరవలిలో అన్నదాతల ఆందోళన

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రైతు సేవా కేంద్రం సోమవారం 12 గంటలయినా తెరుచుకోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి వేలిముద్రలు వేయడానికి ఉదయం 8 గంటలకే రైతుసేవా కేంద్రానికి చేరుకున్నారు. మధ్యాహ్నం అయినా తాళాలు తీయకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈవిషయంపై ఏఓ రవి ప్రశ్నించగా అక్కడ పనిచేస్తున్న అధికారి సెలవుపై వెళ్లడంతో ఆ బాధ్యతలు ఏఈఓకు ఇచ్చామని, మండల ఆఫీస్‌కు వచ్చి డివైజర్ తీసుకెళ్లడంతో ఆలస్యమయిందన్నారు.